3వ అధ్యాయం

# అఖీఖా

# ٣ - بَابُ الْعَقِيقَةِ

1168. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) హసన్ (రజి) మరియు హుసైన్ (రజి)ల తరఫున ఒక్కో పొట్టేలును కోసి, అఖీఖా చేశారు. (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్, అబ్దుల్ హఖ్ దీన్ని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు. అయితే ఈ హదీసు 'ముర్సల్'అని అబూ హాతిమ్ నొక్కి

(١١٦٨) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ عَقَّ عَنِ الْحَسَنِ وَالْحُسَيْنِ كَبْشاً كَبْشاً. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ وَعَبْدُ الْحَقِّ، لٰكِنْ رَجَّحَ

أَبُو حَاتِمٍ إِرْسَالَهُ، وَأَخْرَجَ ابْنُ حِبَّانَ مِنْ حَدِيثِ أَنَسٍ نَحْوَهُ.

చెప్పారు. ఇంకా ఇబ్నె హిబ్బాన్ కూడా హజ్రత్ అనస్ (రజి) ఆధారంగా ఇలాగే ఉల్లేఖించారు).

**సారాంశం**

పుట్టిన శిశువు తరపున జిబహ్ చేయబడే దానిని అఖీఖాగా వ్యవహరిస్తారు.

అయితే - గర్భస్థ శిశువు తలపై మొలిచే వెంట్రుకలను అసలు 'అఖీఖా' అంటారు. పుట్టిన శిశువుకు ఆ వెంట్రుకలు ఉన్న స్థితిలోనే పశువును జిబహ్ చేసి, శిరో ముండనం చేయటం జరుగుతుంది. పుట్టిన శిశువు మగ పిల్లవాడైనప్పటికీ అతని పేరున ఒక జంతువును జిబహ్ చేసినా సరిపోతుందని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది.

**హదీసు ఉల్లేఖకులు**

హుసైన్ (రజి): ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన హసన్ (రజి) గురించి ఈ పుస్తకం మొదటి భాగం (నమాజ్ పుస్తకం)లో చెప్పుకున్నాము. ఇక హజ్రత్ హుసైన్ (రజి) గురించి - ఈయన హజ్రత్ హసన్ సోదరులు. హజ్రత్ హసన్ (రజి) కన్నా సుమారు ఏడాది చిన్నవారు. ఇద్దరూ దైవప్రవక్త (సఅసం) ముద్దుల మనవళ్ళు. హజ్రత్ హుసైన్ (రజి) హిజ్రీ 61లో ముహర్రం 10వ తేదీన ఇరాక్‌లోని 'కర్బలా' కదన రంగంలో అమరగతి నొందారు. సదాచార సంపన్నులు; ప్రశంసలు, పొగడ్తలకు అతీతులు.

(١١٦٩) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَسُولَ اللهِ أَمَرَهُمْ أَنْ يُعَقَّ عَنِ الْغُلَامِ شَاتَانِ مُكَافِئَتَانِ، وَعَنِ الْجَارِيَةِ شَاةٌ. رَوَاهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ، وَأَخْرَجَهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ عَنْ أُمِّ كُرْزٍ الْكَعْبِيَّةِ نَحْوَهُ.

1169. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : మగ పిల్లవాని తరపున ఒకే విధమైన రెండు మేకలు, ఆడ పిల్ల తరఫున ఒక మేకను కోసి అఖీఖా చేయవలసిందిగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహచరులకు ఆదేశించారు. (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు. ప్రామాణికంగా కూడా ఖరారు చేశారు. అహ్మద్ మరియు 'నలుగురు' కూడా ఉమ్మె కుర్జ్ కాబియా ద్వారా ఇదే విధంగా ఉటంకించారు)

**సారాంశం**

ఇది 'జమ్హూర్' దృష్టిలో అభిలషణీయం. అయితే అఖీఖాలో మగపిల్లవాడైతే రెండు

మేకల్ని, ఆడపిల్ల అయితే ఒక మేకను జిబహ్ చేయాలని హదీసులో స్పష్టంగా చెప్పబడింది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) దృష్టిలో ఈ 'తేడా' కనబరచనవసరం లేదు. అయితే ఆయన అభిప్రాయం ఈ హదీసుకు విరుద్ధంగా ఉంది. ఖుర్బానీ పశువుల మాదిరిగా అఖీఖా పశువుల విషయంలో కఠినమైన షరతులైతే లేవుగాని మొత్తమ్మీద అఖీఖా పశువులో కూడా పెద్ద లోపం ఏదీ ఉండకూడదు. ఖుర్బానీ పశువులలో ఏ ఏ లోపాలు ఉండకుండా జాగ్రత్తపడమని చెప్పబడిందో వాటిని ఈ సందర్భంగా దృష్టిలో పెట్టుకోవటం అభిలషణీయం. అఖీఖా సందర్భంగా జిబహ్ చేసే పశువు 'ముసిన్నా' (నిర్ణీత వయస్సుకు చేరినదై) ఉండాలన్న షరతు కూడా ఏ హదీసులోనూ లేదు. అయితే అది మరీ మేకపిల్ల అయి ఉండకూడదు. ఇక్కడ అరబీలో 'షాతున్' అనే పదం ప్రయోగించబడింది. దీన్నిబట్టి అది కనీసం మేక అనిపించేలా ఉంటే చాలు.

## హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె కుర్జ్ కాబియా (ర.అన్హా) : ఖుజాఅ తెగకు చెందిన మహిళ. అందుచేత ఈమె ఖుజాయియగా పిలువబడ్డారు. సహాబియా (ప్రవక్త సహచరురాలు). అనేక హదీసులు ఈమెచే ఉల్లేఖించబడ్డాయి.

(١١٧٠) وَعَنْ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**كُلُّ غُلَامٍ مُرْتَهِنٌ بِعَقِيقَتِهِ، تُذْبَحُ عَنْهُ يَوْمَ سَابِعِهِ، وَيُحْلَقُ وَيُسَمَّى**». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

1170. హజ్రత్ సమురా కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : ప్రతి పిల్లవాడూ తన అఖీఖాకు బదులు 'తాకట్టు'గా ఉన్నాడు. పుట్టిన ఏడవ రోజున అతని అఖీఖా చేయాలి.శిరోముండనం చేయించాలి. అతనికి పేరు పెట్టాలి. (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

## సారాంశం

పిల్లవాడు పుట్టిన ఏడవ రోజున అతని తలపైని వెంట్రుకలను తొలగించి, తలకు స్నానం చేయించాలని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. మరి అదే రోజున అతని అఖీఖా చేయటంతో పాటు, అతనికి నామకరణం కూడా చేయటం మంచిది.